క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



దాచేపల్లి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సాహించాలని మండల వ్యవసాయశాఖ అధికారి డి.పాపకుమారి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ పంటలను సోమవారం ప్రదర్శించారు. స్టాల్‌ని ఏఓ పరిశీలించి, మాట్లాడారు. సేంద్రియ పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వాలు ప్రోత్సాహిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కాటుపల్లి రమేష్, మంగళగిరి శ్రీదేవి, జ్యోతి, రాణి, లక్ష్మీప్రసన్న, అనురాధ, మాధవీ పాల్గొన్నారు.

16న వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ



మాచర్ల: వడ్డెర వర్గీయులందరూ ఈ నెల 16న వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మాచర్ల పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు తెలిపారు. సోమవారం మాచర్ల పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొమెర అనంతరాములు, తురుమలకొండ నరసింహారావు, కొమెర శివ, కొమెర సాంబ, బత్తుల కుమార్ పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు



మాచర్ల: ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విద్యార్థులు ఇష్టంతో చదివితే అద్భుతమైన విజయాలు సాధించవచ్చని సీనియర్ వైద్యుడు, రోటరీ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య అన్నారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మీ మాట్లాడుతూ పరీక్షల భయం పోవాలంటే క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ పఠాన్ నాగూర్ వలి, సత్యప్రసాద్, కూరపాటి శివ, హెచ్‌ఎం దుర్గా భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూగజీవాలకు గాలికుంటు టీకా



దాచేపల్లి: మూగ జీవాలకు గాలికుంటు నివారణ టీకా వేయించాలని మండల పశువైద్యాధికారి నార్ల చెన్నయ్య అన్నారు. గాలికుంటు నివారణ మాసోత్సవంలో భాగంగా సోమవారం నారాయణపురంలోని పశు వైద్యశాలలో పశువులకు గాలికుంటు టీకా వేశారు. పశువులు గాలికుంటు వ్యాధి సోకడం వల్ల ప్రాణాలు కోల్పోయే అవకావం ఉందన్నారు. ముందస్తుగానే గాలికుంటు టీకా వేసేలా రైతులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ నెలాఖరు వరకు మండల వ్యాప్తంగా పశువులకు టీకా వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, రైతులు గమనించి పశువులకు టీకా వేయించాలని కోరారు. సిబ్బంది రామకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం



దాచేపల్లి : ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో 392 మంది విద్యార్థులకు గాను 386 మంది హజరయ్యారు.ఆరుగురు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాన్ని సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రైతుబజారు పోయింది.. కారు పార్కింగ్ వచ్చింది

- పిడుగురాళ్ల మార్కెట్ యార్డు స్థలంలో రైతు బజారుకు ప్రతిపాదనలు
- మూడే రోజుల్లో హడావుడిగా దుకాణాలను తొలగించిన అధికారులు
- అనంతరం ఒక్కసారిగా కారు పార్కింగ్ స్థలంగా మార్పు
- విస్మయం వ్యక్తం చేస్తున్న పట్టణ వాసులు



మార్కెట్ యార్డు వద్ద రైతు బజారు ఏర్పాటు చేస్తామన్న స్థలంలో పార్కింగ్ చేసిన కార్లు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద ఖాళీ స్థలం ఉంది. కూటమి ప్రభుత్వం ఇక్కడ రైతు బజారు ఏర్పాటు చేయాలని హడావుడి చేసింది. అనుకున్నదే తడవుగా ఉన్నపళంగా అక్కడున్న దుకాణాలను అధికారులు తొలగించారు. ప్రజలకు తక్కువ ధరకే రైతులు పండించిన కూరగాయలు అందించేందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని అందరూ అనుకున్నారు. కానీ, రైతు బజారు ఏర్పాటు చేస్తామన్న స్థలం కారు పార్కింగ్‌గా మారిపోయింది. ప్రజోపయోగంగా రైతు బజారు ఏర్పాటు చేయకుండా.. కేవలం కొంత మందికి మాత్రమే ఉపయోగపడే కారు బజారును ఏర్పాటు చేయడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అంతా హడావుడి..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు బజారు నిర్మిస్తామని హడావుడి చేశారు. అలాగే మున్సిపల్ అధికారుల చేత నివేదికలను కూడా సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు అందించారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రైతు బజారు నిర్మాణం కోసం కావాల్సిన నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగింది. మెప్మా ఆధ్వర్యంలో ఈ నిధులు కూడా సుమారు రూ. 2 కోట్ల వరకు మంజూరు అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రైతు బజారును మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తించారు.

తొలగించిన దుకాణాలు

మార్కెట్ యార్డు స్థలంలో ఏళ్ల తరబడి దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారిని మున్సిపల్ అధికారులు హుటాహుటినా ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసి, మూడు రోజుల్లోగా పని పూర్తి చేశారు. పట్టణ ప్రజలు రైతు బజారును ఏర్పాటు చేస్తున్నారేమోనని ఆకాంక్షించారు. చివరికి కారు స్టాండ్‌ను ఏర్పాటు చేయటంతో పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్ల స్టాండ్ తాత్కాలికమే..

మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన కారు స్టాండ్ తాత్కాలికమే. జానపాడు రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటం వల్ల కార్ల కోసం మార్కెట్ యార్డు వద్ద కార్ స్టెండ్ ఏర్పాటు చేయటం జరిగింది. రైతు బజారు కోసం ప్రపోజల్ పంపించడం జరిగింది. త్వరలో రూ. 2 కోట్ల నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైతే.. కారు స్టాండ్‌ను తొలగించి, రైతు బజారును ఏర్పాటు చేస్తాం.

– రాఘవేంద్ర, మున్సిపల్ ఏఈ, పిడుగురాళ్ల

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విజయం సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్

పిడుగురాళ్ల: పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నందు సైన్స్ డే సెలబ్రేషన్స్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ బొల్లా గిరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నారుల్లో ప్రతిభ వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్, వాటర్ కలర్స్, లిఫ్ట్ ఆర్ట్ వంటి సృజనాత్మక పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు ఫెవిక్రైల్ హాబీ ఇండియాస్ కృష్ణ కిరిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ నరేష్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్, షీల్డ్స్‌ను అందజేశారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎంపిక



కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేత

విజయపురిసౌత్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాచర్ల మండలం విజయపురిసౌత్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాతంగి సత్యానందం మాదిగ, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ సుశీల మాదిగ సోమవారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా బీర్నీడి రమేష్, ఉపాధ్యక్షుడిగా నేలటూరి సురేష్, మహిళా అధ్యక్షురాలిగా కటికల కుమారి, విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా నల్లూరి అరుణ్‌కుమార్, యువజన కార్యదర్శిగా కుక్కమూడి జగజ్జీవన్ రామ్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీని తాము అధికారికంగా నియమించామని ఇకపై స్థానిక ఎమ్మార్పీఎస్ సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ గౌరవ సలహాదారుడు పలుకూరి జోసఫ్ బాబు, డప్పు – చర్మకారుల సంఘం అధ్యక్షుడు బీర్నీడి కుమార్ అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



మాట్లాడుతున్న కంచర్ల బుల్లిబాబు, వేదికపై ప్రిన్సిపల్ కవిత

మాచర్ల: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరనాత వెల్లటూరు ఏసయ్య సహకారంతో సోమవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా సబ్జెక్టుల వారీగా విద్యార్థులతో పునశ్చరణ చేయించాలన్నారు. ఉదయం యోగాతో ఏకాగ్రత వస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ కవిత మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్న హెల్ప్ ఫౌండేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వెల్లటూరు మరనాత ఏసయ్య, ఉపాధ్యాయులు శివలింగమ్మ, లీలాకుమారి, ఉదయ్‌రాణి పాల్గొన్నారు.

రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత



నగదు చెక్కు అందజేస్తున్న చీఫ్ మేనేజర్ శ్రీనివాస్‌బాబు, సిబ్బంది

మాచవరం: బ్యాంకు ఖాతాదారులు ఇన్సూరెన్సు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఆర్.శ్రీనివాసబాబు అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన అంగడి కొండలు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. గ్రామంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నందు ఖాతాదారునిగా ప్రధానమంత్రి జీవన జ్యోతి ఇన్సూరెన్సు పాలసీకి ప్రీమియం చెల్లించడం జరిగింది. నామినీ, మృతుని భార్య అంగడి నాగులకి రూ.2 లక్షల చెక్కున సోమవారం అందించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు బ్యాంక్ కృషి చేస్తుందని, బ్యాంక్ ఖాతాదారులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే అనేక ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సమీర్, నవీన్, హరిబాబు, మల్లిఖార్జునరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరికెపుడిశెలకు నిధులు కేటాయించాలి

ఎంపీ లావును కోరిన ప్రజా సంఘాల నాయకులు



క్యాంపు కార్యాలయంలో ఎంపీ లావుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: ఎగువ పల్నాడు, బొల్లాపల్లి ప్రాంతాలకు ఉపయోగపడే వరికెపుడిశెల ప్రాజెక్టుకు కావాల్సిన నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ లావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్ట్ పూర్తయితే బొల్లాపల్లి మండలంలో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న ప్రజల బాధలు తీరుతాయన్నారు. అప్పటివరకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా మంచినీరు సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత తనదేనని, తప్పనిసరిగా దాని కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోటా నాయక్, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, సురభి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

గుడ్ మార్నింగ్ మాచర్ల

మాచర్ల: ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలో గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పట్టణంలోని రింగ్ రోడ్డు, నాయుడు బిల్డింగ్ ఎదురు, తహసీల్దారు కార్యాలయంతో పాటు పలు వార్డుల్లో మున్సిపల్ సిబ్బందితో పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

గురజాల: పల్నాటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం మూడవ రోజు కొనసాగాయి. దేవాలయంలో హోమం, బలిహరణం, సాయంత్రం గరుడ సేవ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు కారంపూడి వరదాచార్యులు, కారంపూడి రాఘవాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రెంటచింతల: మండలంలోని పాలువాయి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పాలువాయి, తుమృకోట, పాలువాయిగేటు గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఏఈ షేక్ మస్తాన్‌వలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఆర్‌డీఎస్‌ఎస్ పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వ్యాపారులు సహకరించాలని ఆయన తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బకాయిలను చెల్లించాలని పేర్కొన్నారు.

8న బైబిల్ క్విజ్ పోటీలు

వెల్దుర్తి: పల్నాడు ప్రాంతం యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు ఈ నెల 8న ఉదయం 9 గంటల నుంచి స్థానిక ఆంధ్రా యివాంజిలికల్ లూథరన్ చర్చి ఆవరణలో పల్నాడు బైబిల్ కాలేజీ ఆధ్వర్యంలో మండల స్థాయి బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ శంకర్, శ్రీకాంత్ తెలిపారు. బైబిలు గ్రంథంలోని మార్కు సువార్త పాఠ్యాంశం ఆధారంగా ఈ క్విజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీమ్‌కు ముగ్గురు చొప్పున పాల్గొనాలని, విజేతలకు నగదు బహుమతితో పాటు ధృవీకరణ పత్రాలు ప్రదానం చేస్తామని చెప్పారు. వివరాలకు 63622 18163, 83091 18960 నంబర్లకు సంప్రదించాలన్నారు.

భూసార పరీక్షలతో మేలు

రెంటచింతల: పంటలను సాగు చేసేముందు భూసార పరీక్షలు చేయించుకోవడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, సూక్ష్మ పోషకాలపై ఒక అవగాహన ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్‌లైతే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని పేర్కొన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, ఎరువులు వాడుకోవాలని తెలిపారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు.

బాల్య వివాహాల నియంత్రణకు అవగాహన



కరపత్రాలు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దాచేపల్లి: బాల్య వివాహాలను నియంత్రించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ సీహెచ్ వరలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సోమవారం నారాయణపురంలో అవగాహన కార్యక్రమం చేపట్టి, కరపత్రాలు పంపిణీ చేశారు. బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల వయస్సు నిండకుండా బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, బాలికలను చదివించి ప్రయోజకులను చేయాలని ఆమె సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు దారి తీస్తాయన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత చదువులు చదివించాలని సూపర్ వైజర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, కేవీ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పింఛన్ నగదు పంపిణీ



పింఛన్ నగదు కోసం సచివాలయం వద్ద ఎదిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

దాచేపల్లి: స్థానిక నగర పంచాయతీలోని వార్డు సచివాలయం–3 పరిధిలో పింఛన్‌దారులకు ఎట్టకేలకు సోమవారం కమిషనర్ ఎంవీ అప్పారావు పర్యవేక్షణలో పింఛన్ నగదు పంపిణీ చేశారు. సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ సంపతి లక్ష్మీప్రసాద్ రూ.8.23లక్షల పింఛన్ సొమ్ముతో పారిపోయిన విషయం తెలిసిందే. లక్ష్మీప్రసాద్ నగదుతో పారిపోవడంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పింఛన్ నగదు అందకపోవడంతో లబ్ధిదారులు మూడు రోజులుగా సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. కమిషనర్ అప్పారావు ప్రత్యేక చొరవ తీసుకుని, పింఛన్ నగదు పంపిణీకి చర్యలు చేపట్టారు. నగర పంచాయతీ పరిధిలో మిగిలిన పింఛన్ నగదును సిబ్బంది నుంచి నగదు సేకరించారు. నగదుతో పారిపోయిన లక్ష్మీప్రసాద్‌పై శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ చెప్పారు.

ఉపాధి హామీ పనులతో కూలీలకు భరోసా



మంచికల్లు శివారులో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

రెంటచింతల: గ్రామీణ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు చూపించి, భరోసా కల్పించాలని ఏపీడీ జి.జయచంద్రకుమార్ అన్నారు. సోమవారం రెంటచింతల గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద 42 మంది కూలీలతో చేపట్టిన పంట కాల్వ పూడికతీత పనులను, మస్టర్‌ను ఆయన పరిశీలించారు. ఎఫ్‌ఏకు పలు సూచనలు చేసి, మాట్లాడారు. 2024–25కు సంబంధించి రూ.8 కోట్ల విలువైన 462 పనులను ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తిచేయాలని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఆయా గ్రామాల సమీపంలోని 70 నీటి కుంటల్లో పూడికతీత పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. 10 గ్రామాల్లో మొత్తం 545 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. 2025–26కు సంబంధించి ఇప్పటి వరకు రూ.2 కోట్ల విలువైన 253 పనులను గుర్తించడం జరిగిందన్నారు. 11 గ్రామాల్లో మొత్తం 11 వేల జాబ్ కార్డులను మంజూరు చేశామని, వాటి ద్వారా 18 వేల మందికి ఉపాధి పనులకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద గ్రామాల్లో చేపట్టే పనులకు ఖచ్చితంగా ప్రభుత్వ అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ వి.విజయకుమారి, ఎఫ్‌ఏ తదితరులున్నారు.

రోడ్డుకడ్డంగా కరెంట్ స్తంభం వేసి నిరసన



ఆందోళన చేస్తున్న స్థానికులు

కారెంపూడి: విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్‌లో వినియోగదారులు సోమవారం ఆందోళనకు దిగారు. రోడ్డుకు అడ్డుగా విరిగిన కరెంటు స్తంభాన్ని వేసి, నిరసన వ్యక్తం చేశారు. రంజాన్ ఉపవాస ప్రార్థన దినాల సమయంలో కరెంటు లేకపోవడంతో తాగునీటికి, ప్రార్థనలు చేసుకోడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విషయమై ఏఈఈ వీరాంజనేయులును వివరణ కోరగా ఆదివారం సాయంత్రం ఒక వాహనం స్తంభాన్ని ఢీకొనడంతో అది విరిగిపోయిందని చెప్పారు. రాత్రి పూట పనులు చేయడం కష్టం కావడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి కొత్త పోల్ వేయించి పనులు చేయిస్తున్నామన్నారు. సాయంత్రానికి కరెంటును పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆందోళన

దాచేపల్లి: మండలంలోని ముత్యాలంపాడు గ్రామస్తులు ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టారు. తంగెడ–దాచేపల్లి రోడ్డు నిర్మాణం తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ గంటపాటు వాహనాల రాకపోకలు పూర్తిగా అడ్డుకున్నారు. రోడ్డుకి అడ్డుగా వాహనాలు, రాళ్లు పెట్టి బైఠాయించారు. నాలుగు నెలల క్రితం రోడ్డు నిర్మాణం చేస్తామని చెప్పి, మొత్తం తవ్వేశారని చెప్పారు. ఇంత వరకు రోడ్డు పనులు ప్రారంభించలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని, రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని అవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపైకి వస్తే దుమ్మూ ధూళితో అల్లాడిపోతున్నామని చెప్పారు. అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని చెప్పుకొచ్చారు. తక్షణమే రోడ్డు పనులు చేపట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనపై సమాచారం రావడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. వారు అంగీకరించక పోవడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

రేపటి నుంచి 'ఉపాధి' పనులపై గ్రామ సభలు

వెల్దుర్తి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం నుంచి 10వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న గంగలకుంట, రామచంద్రపురం తండ, హనుమాపురం తండ, శిరిగిరిపాడు, లోయపల్లి, పట్లవీడు, వెల్దుర్తి గ్రామాలు, 6న మండాది, 7న గొట్టిపాళ్ల, 8న ఉప్పలపాడు, కొత్తపుల్లారెడ్డి గూడెం, రచ్చమల్లపాడు, మిట్టమీదిపల్లె, గుండ్లపాడు, మరసపెంట, 10న చినపర్లపాయి తండ, బోదిలవీడు, వజ్రాలపాడు, కండ్లకుంట, శ్రీరాంపురంతండలో గ్రామ సభలు జరుగుతాయన్నారు. గ్రామస్తులంతా పాల్గొనాలని పేర్కొన్నారు.

దుకాణంలో చోరీ

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. పాత గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న నిత్యావసర సరుకుల దుకాణంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు, సరుకులను ఎత్తుకెళ్లారు. దుకాణంపై భాగంలోని రేకులను కత్తిరించి దుండగులు లోపలికి దిగారని బాధితుడు కాశయ్య తెలిపారు. రూ.5వేల నగదు, రూ.20 వేలు విలువ చేసే సరుకులను చోరీ చేశారని వెల్లడించారు. సోమవారం ఉదయం దుకాణం తీశాక చోరీ జరిగినట్లుగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు ప్రారంభించారు.

నవధాన్య సాగుతో ఉత్తమ ఫలితాలు



వేసవి కాలంలో విత్తన గుళికలు మొలకెత్తడంపై డెమో చూపిస్తున్న అధికారులు

బొల్లాపల్లి : ఖరీఫ్ సాగుకు ముందు రైతులు తమ పొలాల్లో నవధాన్య విత్తనాలు చల్లి సాగు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎ. అంకారావు సూచించారు. ప్రకృతి వ్యవసాయం సాగులో భాగంగా మండల కేంద్రంలోని ఆర్‌బీకే సెంటర్‌లో అనుబంధ శాఖల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ నవధాన్య విత్తనాలు చల్లడం వలన చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా తమ వంతు కృషి చేయాలన్నారు. కిచెన్ గార్డెన్‌లు ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం వేసవిలో నవధాన్య విత్తనాల సాగు, అవి మొలకెత్తేందుకు అనుగుణంగా విత్తన గుళికల విధానం, వ్యవసాయ సాగుపై డెమో చేసి చూపించారు. గత నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో నవధాన్య సాగు ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను ఈ సమీక్ష సమావేశంలో సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, వెలుగు పథకం, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.